పేదల పట్ల దయా, కరుణ కలిగి ఉండాలి

నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాత

మధిర, మే 14 : పేదల పట్ల దయ, కరుణ కలిగి ఉండాలని ప్రముఖ వ్యాపారవేత్త, గాయకుడు పుల్లఖండం చంద్రశేఖర్ కోరారు. మంగళవారం ఉదయం పట్టణంలో స్థానిక టీవీఎం హైస్కూల్ టీవీఎం వాకర్స్క్లబ్ తరపున సభ్యులు, చంద్రశేఖర్ 20 పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవతా ధృక్పథంతో ముందుకు సాగుతూ ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకుడు లంకా కొండయ్య, వాకర్స్క్లబ్ సభ్యులు, సేవాఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

తుమ్మలను కలిసిన మండల నాయకులు

మంత్రి తుమ్మల

మంత్రి తుమ్మలతో మండల నాయకులు

వేంసూరు, మే 14: రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావును దమ్మపేట మండలం గండుగలపల్లి గ్రామంలోని తన నివాసంలో మండలానికి చెందిన నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారితో తుమ్మల మాట్లాడుతూ మండలంలోని లింగపాలెం వద్ద ఎగ్జిట్ చేపించడం, మండలంలో కొత్త పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించే నాదే బాధ్యత అని అన్నారు. అతి త్వరలో వీటికి సంబంధించిన జీవోను తీసుకొచ్చి మీకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న కాలంలో మండలం అత్యధికంగా పామాయిల్ సాగును ప్రోత్సహించాలని తుమ్మల రైతులను కోరారు.

నేటి నుంచి 'దోస్త్' వెబ్ ఆప్షన్లు ప్రారంభం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఖమ్మం ఎస్ఆర్బీజీఎన్ఆర్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 14: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం 'దోస్త్' (డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్ తెలంగాణ) వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని ఖమ్మం ఎస్ఆర్బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. ఈ మేరకు ప్రచార పోస్టర్‌ను మంగళవారం తమ కళాశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు బుధవారం నుంచి వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చని తెలిపారు. ఈ నెల 25 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, 27 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంటుందని వెల్లడించారు. మొదటి విడత సీట్లు కేటాయింపు ఫలితాలు జూన్ 3న వెలువడుతాయని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్స్ బీవీ రెడ్డి, జీవన్, సత్యవతి, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, గోపి, వేలాద్రి, వెంకన్న, ఎంవీ రమణ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల పనితీరు భేష్

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్

ఖమ్మం రూరల్, మే 14 : లోక్‌సభ ఎన్నికల సంగ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లు, పార్టీ అభిమానుల అద్భుతమైన పనితీరు కనపరిచారని వారందరికీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత కొంత నిరుత్సాహపడినప్పటికీ వెనువెంటనే తేరుకొని తిరిగి బలంగా నిలబడి కొట్లాడిన తీరు అభినందనీయమన్నారు.

జిల్లాలోనే అత్యధికంగా పాలేరులో పోలింగ్ శాతం నమోదు

కూసుమంచి, మే 15 : పార్లమెంట్ పరిధిలో సోమవారం జరిగిన పోలింగ్‌లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కంటే పాలేరులో అత్యధికంగా 83.79 శాతం మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాలేరులో 2,40,756 మందికి గాను 2,01,735 మంది ఓటు హక్కు వినియోగించుకొని పోలింగ్ నమోదులో పాలేరు మరోసారి ప్రత్యేకతను చాటుకుంది.

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పోలింగ్..

మండలం	మొత్తం ఓట్లు	పోల్ అయినవి	పోలింగ్ శాతం
కూసుమంచి	49,644	42,558	87.70
తిరుమలాయపాలెం	50,008	42,051	84.08
ఖమ్మం రూరల్	91,875	75,015	81.65
నేలకొండపల్లి	49,229	42,111	85.64
మొత్తం	**2,40,756**	**2,01,735**	**83.79**

నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

ఖమ్మం రూరల్‌లో 81.53శాతం పోలింగ్

ఖమ్మం రూరల్, మే 14 : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మండల వ్యాప్తంగా సరాసరి 81.53శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 91,875 మంది ఓటర్లకు గాను 74,954మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో కాచిరాజుగూడెం పరిధిలోని రేగులతండ 85పోలింగ్ బూత్‌లో మొత్తం 180 మంది ఓటర్లకు గాను 177మంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో 98.33శాతం ఓట్లు నమోదు అయ్యాయి. అదే విధంగా గుండాల తండ పోలింగ్‌బూత్ 66లో మొత్తం 203మంది ఓటర్లకు గాను 196మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 96.55శాతం పోలింగ్ జరిగింది. అత్యల్పంగా పెద్దతండ పంచాయతీ పరిధిలోని బూత్ నెంబర్131లో మొత్తం 1127మంది ఓటర్లు ఉండగా, కేవలం 623మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవడంతో 55.28శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్‌స్టేషన్ వద్ద బారులు తీరిన ఓటర్లు

మధిర నియోజకవర్గంలో 81.84శాతం..

మధిర, మే 14 : నియోజకవర్గంలోని 5 మండలాల్లో 81.84 శాతం పోలింగ్ శాతం నమోదైంది. అత్యధికంగా చింతకాని మండలంలో 86.44 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా మధిర మండలంలో 76.94 శాతం నమోదైంది. ముదిగొండ, చింతకాని, బోనకల్లు, మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని 268 పోలింగ్‌స్టేషన్లలో 2,22,160 మంది ఓటర్లకు గాను పురుషులు 1,07,111 ఓట్లు, మహిళలు 1,15,039 ఓట్లు, ఇతరులు 10 ఓట్లు పోలింగ్ కావాల్సి ఉండగా పురుషులు 88,939 ఓట్లు, మహిళలు 92,870, ఇతరులు 6 ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు.

మమ్మల్ని వద్దని ఇతరులకెలా ఇస్తారు?

- రైలు మార్గం వచ్చాక బొగ్గు లోడింగ్ గణనీయంగా తగ్గించారు
- అయినా సరిపెట్టుకొని లారీలపై ఆధారపడి బతుకుతున్నాం
- ఇప్పుడు మరొకరికి లోడింగ్ ఇచ్చి మమ్ములను 'రోడ్డు'న పడేస్తారా?
- సత్తుపల్లి కిష్టారం ఓసీ వద్ద లారీ యజమానుల ఆందోళన
- నిల్వల రవాణాకు కోలిండియా అనుమతిచ్చింది: ఓసీ పీవో

ఆందోళన చేస్తున్న లారీ యజమానులు

సత్తుపల్లి టౌన్, మే 14: సింగరేణి సత్తుపల్లి కిష్టారం ఓసీ నుంచి రుద్రంపూర్ కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ)కు రోడ్డు మార్గాన బొగ్గును తరలించే అవకాశాన్ని తమకు కాకుండా మరొకరికి ఎలా ఇస్తారంటూ సత్తుపల్లి బొగ్గు లారీల యజమానులు ప్రశ్నించారు. ఇక్కడి నుంచి వేరొకరి వాహనాల ద్వారా బొగ్గు రవాణాను జరగనివ్వబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం కిష్టారం ఓసీ వద్ద బొగ్గు రవాణా లారీల యజమానుల ధర్నా చేపట్టి సింగరేణి కార్యకలాపాలను అడ్డుకున్నారు. ఉదయం నుంచి నుంచి మధ్యాహ్నం దాకా లారీలు బయటకు రాకుండా నిలిపివేశారు. ఈ మేరకు సింగరేణి అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు కొండపల్లి రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సత్తుపల్లి బొగ్గు రవాణా ఆధారంగా 760 లారీల యజమానులం బతుకున్నామని, ఇందులో ఎక్కువమందికి సింగరేణి విస్తరణలో భూములు కోల్పోయిన నిరాశ్రయులమేనని అన్నారు. జీవనోపాధి కోసం ఇక్కడే లారీలు నడుపుతూ, బొగ్గు రవాణా చేస్తూ బతుకున్నామని అన్నారు. తమ లారీలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. గతంలో సత్తుపల్లి నుంచి రుద్రంపూర్ కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు 90 వేల టన్నుల బొగ్గును లారీల ద్వారా రవాణా చేయడంతో తామంతా దాని ద్వారా ఉపాధి పొందుతూ జీవించేవాళ్లమని అన్నారు. ఇప్పుడు రైలు మార్గం వచ్చాక కేవలం 3 వేల టన్నులు ఇచ్చినా సరిపెట్టుకొని దానినే రవాణా చేస్తూ జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఈ బొగ్గు రవాణాను మరొకరికి ఇవ్వడం ద్వారా తమ బతుకులు రోడ్డున పడుతున్నాయని, తమకు ఆత్మహత్యలే శరణ్యంగా కన్పిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, కొన్నిసార్లు తమ లారీల ద్వారా ఇతర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలకు బొగ్గును పంపినప్పుడు అది తక్కువ వస్థాయి గ్రేడ్ బొగ్గంటూ అక్కడి యజమానులు రోజుల తరబడి దిగుమతి చేసుకోకుండా ఇబ్బందులకు గురిచేసినా భరిస్తున్నామని అన్నారు. ఆందోళనలో సత్తుపల్లి లారీ ఓనర్ల అసోసియేషన్ సభ్యులు టీఎల్ ప్రసాద్, కిజర్, రఫీ, చిన్నం శెట్టి శ్రీనివాసరావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిల్వల తరలింపునకు కోలిండియా అనుమతిచ్చింది: పీవో

కిష్టారం ఓసీలో 4 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని కిష్టారం ఓసీ పీవో రమేశ్ తెలిపారు. ఈ నిల్వలు పేరుకపోకుండా ఉండేందుకు ఆర్‌సీహెచ్‌పీకి లారీల ద్వారా రవాణా చేసేందుకు కోల్ ఇండియా ఆరు నెలల పాటు అనుమతిచ్చింది. ఆ ఆరు నెలల గడువు అనంతరం వేరే లారీల కాంట్రాక్ట్ రద్దవుతుంది.

ఆందోళనకారులతో మాట్లాడుతున్న పీవో

నామాకు ఓటు వేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు

ఎర్రుపాలెం, మే 14 : బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు ఓటు వేసిన ప్రతిఒక్కరికీ బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పంబి సాంబశివ రావు, యన్నం శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వివిధ హోదాల్లో ఉన్న ముఖ్యనాయకులు, మాజీసర్పంచ్‌లు, ఎంపీటీసీలకు, సొసైటీ చైర్మన్లకు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీడైరెక్టర్లు, బీఆర్ఎస్ అభిమానులకు, మహిళా సభ్యులకు మండల కమిటీ తరపున మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ చావా రామకృష్ణ, జడ్పీటీసీ శీలం కవిత, ఎంపీపీ సూరానేని రామకోటేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

టీఎస్ఆర్‌జేసీలో 'త్రివేణి' విద్యార్థుల సత్తా

విద్యార్థులను అభినందిస్తున్న త్రివేణి పాఠశాల ప్రిన్సిపాల్

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 14: టీఎస్ఆర్‌జేసీ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఖమ్మంలోని త్రివేణి పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. తమ పాఠశాల విద్యార్థుల్లో మోక్షితాసాయి 126 మార్కులు, లక్ష్మి 124, వెంకటేశ్వర్లు 114, శ్రీహిత 113, సాయిసాత్విక 109 మార్కులతో సత్తా చాటినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ వీరేంద్రచౌదరి, కృష్ణవేణి – త్రివేణి విద్యాసంస్థల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

2న ఖమ్మంలో పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ఖమ్మం సిటీ, మే 14: ఖమ్మం, భద్రాద్రి జిల్లాల జూనియర్, సీనియర్స్ ఓపెన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు జూన్ 2న జరుగనున్నాయని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ మనోజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రోత్సాహంలో కోసమే నిర్వహిస్తున్న ఈ పోటీలు ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమవుతాయని అన్నారు. మహిళలు, పురుషుల విభాగాల్లోనూ, సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లోనూ జిల్లా ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపికైన వారు జూలై 6, 7 తేదీల్లో ఖమ్మంలో జరిగే సీనియర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత పొందుతారని తెలిపారు. క్రీడాకారులంతా రౌండ్ నెక్ టీషర్ట్స్, షార్ట్స్ ధరించి హాజరుకావాలని సూచించారు. టిఫిన్, భోజన వసతి కల్పిస్తామని వెల్లడించారు. ఎంట్రీ ఫీజు రూ.300 ఉంటుందని, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్లు తీసుకుని రావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, మే 14: ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీబీఎస్ఈ సిలబస్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గండుగులపల్లిలోని ఈఎంఆర్ఎస్ (బాలికలు) ఎంపీసీలో 9, సీఈసీలో 27 సీట్లు ఉన్నాయని ఆసక్తి గలవారు 9948933010 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈఎంఆర్ఎస్ పాల్వంచ (బాలికలు) ఎంపీసీలో 6, బైపీసీ 1, సీఈసీలో 26 (8317556834) ఈఎంఆర్ఎస్ గుండాల (బాలికలు) ఎంపీసీలో 7, సీఈసీలో 26 సీట్లు ఉన్నాయని (8978556948), ఈఎంఆర్ఎస్ టేకులపల్లిలో (బాలురు) బైపీసీలో 15, సీఈసీలో 15 (7032266792), ఈఎంఆర్ఎస్ దుమ్ముగూడెం (బాలురు/బాలికలు) ఎంపీసీలో 9 సీట్లకు బాలురకు 2, బాలికలకు 7, బైపీసీలో 11 సీట్లు, హెచ్ఈసీలో 12 సీట్లకు బాలురకు 7, బాలికలకు 8 (9885871670) సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. చర్ల, ములకలపల్లి, సింగరేణిలో సీట్లు ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈఎంఆర్ఎస్ విద్యాలయాల్లో సమర్పించాలని తెలిపారు. ఈ నెల 22న ఈఎంఆర్ఎస్ చర్ల@భద్రాచలంలో కౌన్సెలింగ్ జరుగనున్నట్లు ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ పేర్కొన్నారు.

జూన్ 8న జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెం టౌన్, మే 14: జిల్లా కోర్టులో వచ్చే నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★I, **CHAVA RATNAKUMARI** (OLD NAME) R/o. 5-11-132/1,Cooliline, Kothagudem, Bhadradri Kothagudem Dist, Telangana Changed MY NAME AS **PATIBANDLA RATHNA KUMARI** (New name), W/o. PATIBANDLA JANARDHAN RAO.
KMM

WANTED

jobs Apply Now!

★**ప్రముఖ కంపెనీ** BERAR FINANCE లో Recovery Agents మణుగూరు, కొత్తగూడెం బ్రాంచీలలో పనిచేయుటకు కావలెను. అర్హత : డిగ్రీ, అనుభవం : 2 వీలర్ రంగంలో Recovery/ Collection చేసిన అనుభవం కలవానరికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి గలవారు సంప్రదించగలరు. సెల్ :8010904737 (Whatsapp)
KMM

RECRUITMENT

★**Pen, Pencil Company, Educated,** Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

INDUSIND BANK LTD.
LIGHT COMMERCIAL VEHICLE FOR SALE
1).TATA ACE GOLD DIESEL BS VI, MODEL 2023, TS04UE5292. **2).** BAJAJ RE CNG 4S FI BS VI, MODEL 2023, TS04UE2893, **3).** TATA ACE GOLD PETROL CX CLB BS 6, MODEL :2021, TS 04UD7664. **4).** APE AUTO DX BS6, MODEL :2023, TS04UE0257.
Cell:**9959401146**
PolasJuice Point Lane, ZP Centre Beside Sidhardha Hospitals,Khammam.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది
కె.రంగరాజు, S/o. **కోటమ్ రాజు,** నివాసం : ఇ.నెం. 11-520, బైపాస్ రోడ్డు, ఏదులాపురం, పెద్దతండా జి.పి. ఖమ్మం రూరల్, ఖమ్మం జిల్లా అను నేను మా ఇంటి నుండి పెద్దతండా వెళ్తుండగా మార్గమధ్యలో ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ **(డాక్యుమెంట్ నెం. 1805/2005)** పోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
Cell: 9848130258

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భూసార పరీక్షలకు.. ఇదే 'అదును'

- పొలాల్లో మృత్తిక పరీక్షలకు ప్రస్తుత తరుణం ఎంతో మేలు
- భూసార పరీక్షలతోనే పంటకు పోషకాలు, సుస్థిర దిగుబడులు

వైరా టౌన్, మే 14: తొలకరి మొదలవుతున్న వేళ భూసార పరీక్షలకు ఇదే మంచి 'అదును' అంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు. భూసార పరీక్షలతోనే పంటకు పోషకాలు అందుతాయని, సుస్థిర దిగుబడులు సాధ్యమవుతాయని చెబుతున్నారు. పొలాల్లో మృత్తిక పరీక్షలకు ప్రస్తుత తరుణం ఎంతో మేలు చేస్తుందని వివరిస్తున్నారు.

భూసార పరీక్షల కోసం పొలంలో మట్టిని సేకరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు (ఫైల్)

అధిక దిగుబడికి దోహదం..

నేలల్లో సహజంగా ఉన్న పోషక పదార్థాలతోపాటు అదనంగా వేసిన ఎరువుల్లోని పోషకాలు మొక్కలకు అంది పంట దిగుబడికి దోహదపడతాయి. కాబట్టి నేలల్లో ఉన్న భూసారాన్ని తరచూ తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. తద్వారా రసాయనిక ఎరువుల కోసం వెచ్చించే అనవసరపు ఖర్చులు తగ్గుతాయి. దీంతో భూసారాన్ని కాపాడుకున్నట్లవుతుంది. తద్వారా సుస్థిర దిగుబడులను సాధ్యమవుతుంది. కాబట్టి ఇందుకోసం రైతులు తమ పొలంలోని మట్టిని రెండేళ్లకోసారి పరీక్ష చేయించుకుంటే మంచిది. భూమిలోని చౌడు గుణాలను, సున్నం శాతాన్ని తెలుసుకునేందుకు, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు మృత్తిక పరీక్షలు చేయించుకోవాలి.

భూసార పరీక్ష విధానం ఎలాగంటే..

భూసార పరీక్షలో ముందుగా తెలుసుకోవాల్సిన అంశం మట్టి నమూనాను సేకరించడం. భూసార పరీక్ష కోసం తీయాల్సిన మట్టి నమూనా సరైనది కాకుంటే భౌతిక, రసాయనిక, జీవ లక్షణాలు మన పొలం సారాన్ని ప్రతిబింబించేవిగా ఉండవు. దీని వల్ల చేయించిన భూసార పరీక్షకు నిష్ప్రయోజనమవుతుంది. శాస్త్రవేత్తల సిఫార్సులు కూడా వ్యర్థమవుతాయి. అంతేగాక ఒక్కోసారి సరిపడని సిఫార్సులు కూడా అందే ప్రమాదముంది. అందుకని మట్టి నమూనా సేకరణలో ఈ కింది జాగ్రత్తలను తప్పక పాటించాలి.

నమూనాల సేకరణలో జాగ్రత్తలు ఇవే..

పొలంలో 'v' ఆకారంలో 15 సెంటీమీటర్ల వరకు పారతో గుంత తీయాలి. అందులో పై పొర నుంచి కింద వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి. ఈ మట్టిలో రాళ్లు, పంట వేర్లు మొదళ్లు తీసేసి నీడలో ఆరనివ్వాలి. ఈ విధంగా ఎకరా విస్తీర్ణంలో 8 – 10 చోట్ల సేకరించిన మట్టిని ఒక దగ్గర చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలుగా చేయాలి. అందులో ఎదుటి భాగాలు తీసుకొని మిగతా భాగాలు తీసివేయాలి. ఈ విధంగా మట్టి 1/2 కిలో వచ్చే వరకు చేయాలి. మట్టి సేకరణకు శుభ్రమైన గోదాము షీటు లేక ప్లాస్టిక్ షీటు మాత్రమే వినియోగించాలి.

గట్ల దగ్గర మట్టిని సేకరించొద్దు..

అలాగే, భూసార పరీక్షల కోసం గట్ల దగ్గరి మట్టిని, పంట కాలువ దగ్గరలోని మట్టిని తీసుకోవద్దు. అలాగే, చెట్ల కింద ఉన్న పొలం భాగం నుంచి కూడా సేకరించొద్దు. ఎరువు కుప్పలు వేసి ఉంచిన చోట, ఎప్పుడూ నీరు నిలిచే చోట మట్టిని తీసుకోవద్దు. పొలంలో వాలు ఎక్కువగా ఉన్నప్పుడు దానిని ఎత్తు, పల్లపు ప్రాంతాలుగా విభజించి వేర్వేరుగా మట్టి నమూనాలను సేకరించాలి.

లొంగిపోయిన 30 మంది మావోయిస్టులు

- 9 మందిపై రూ.39 లక్షల రివార్డు
- వివరాలు వెల్లడించిన బీజాపూర్ ఎస్పీ జితేంద్ర

కొత్తగూడెం క్రైం, మే 14 : ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా విస్తరిస్తోన్న మావోయిస్టులపై కేంద్ర బలగాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. 'లోన్ వర్రుట్' పేరుతో మావోయిస్టులను నిర్మూలించే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతా బలగాలతో దండకారణ్యంపై దండయాత్ర చేస్తున్నాయి. నాలుగు నెలల కాలంలో జరిగిన యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో బస్తర్ రేంజ్ పరిధిలో సుమారు 110 మంది మావోయిస్టులు నేలకొరిగారు. వందలాది మంది దళ సభ్యులు, సానుభూతిపరులు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో 30 మంది మావోయిస్టులు జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్, సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఎస్‌కే మిశ్రా ఆధ్వర్యంలో లొంగిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అజ్ఞాతంలో ఉన్న 30 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు ఆయన తెలిపారు. వారిలో 9 మంది మావోయిస్టులపై రూ.39 లక్షల రివార్డులు ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో ఒకరిపై 18 అరెస్టు వారెంట్లు పెండింగ్‌లో ఉండగా.. మరొకరిపై 6 స్టే వారెంట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరంతా పదిహేనేళ్లలో అనేక విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 180 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయగా.. 76 మంది లొంగిపోయినట్లు స్పష్టం చేశారు. భద్రతా దళాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి కారణంగానే మావోయిస్టులు లొంగు'బాట' పడుతున్నారని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరపున వెంటనే రూ.25 వేల చొప్పున అందజేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. తద్వారా వారంతా జీవనోపాధి పొందేందుకు దోహదపడుతుందని వివరించారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616